క్లుప్తంగా

సీసీ రహదారి నిర్మాణంపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న జీఎంఆర్ కాలనీ వాసులు

రణస్థలం: మండల కేంద్రంలోని జే.ఆర్.పురం పంచాయతీలో గల సూర్య స్కూల్ పక్కన జీఎంఆర్ కాలనీ వాసుల సీసీ రహదారి నిర్మాణంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. పదిహేళ్లకు పైగా సీసీ రహదారి ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులు, అధికారుల దగ్గరకు తిరిగినా ఫలితం లేకపోయింది. ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్, జే.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, ఎంపీటీసీలు పచ్చిగుళ్ల సాయిరాం, స్థానిక నాయకులు చొరవతో సీసీ రోడ్డు వేయడం పట్ల జీఎంఆర్ కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

సాగు పట్టాల పంపిణీ



పేదలకు సాగు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: ఎన్నో ఎళ్లుగా పేద రైతులు సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కల్పించి పట్టాలు మంజూరు చేయడం శుభపరిణామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పాతర్లపల్లి పంచాయతీకి చెందిన పేద రైతులకు సాగు భూమి పట్టాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి హయంలో పేద రైతులకు పట్టాలు మంజూరు చేస్తే.. మరలా అతని కుమారుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి హయాంలో సాగు పట్టాలు అందజేయడం జరుగుతుందన్నారు. పేదల ప్రజల అశీస్సులతో 2024లో కూడా సీఎం జగన్ అధికారంలోకి వస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాతర్లపల్లి గ్రామ నాయకులు ముఠామేస్త్రి, అల్లు సూర్యనారాయణ, మండాది రాము తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి శిక్షణ



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

జి.సిగడాం: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేందుకు, పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా వ్యాధి నిరోధిక టీకాలు వేయించి ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు గీష్మ, వర్మ రెడ్డి, సురేష్ అన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో రెడ్డీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఎంఎల్ఎస్పీలకు సోమవారం శిక్షణ ఇచ్చారు. గర్భిణులు ప్రతినెలా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల మందులు, మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. వైద్యాధికారి బుడుమూరు యశ్వంత్ మాట్లాడుతూ.. గ్రామాల్లో అంటు రోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీపీ, సుగర్ ఉన్నవారికి నెలకు సరిపడే మందులను అందిస్తున్నామన్నారు.

ధర్మవరంలో పారిశుద్ధ్య పనులు



మురుగును తొలగిస్తున్న దశ్యం

ఎచ్చెర్ల: ధర్మవరం గ్రామంలో సోమవారం పారిశుద్ధ్య పనులను చేపట్టారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు కాలువల్లో పూడికతీత పనులను చేపట్టారు. వీధులను శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లారు. ఈ పనులను గ్రామ సర్పంచ్ అల్లు కన్నబాబు, పంచాయతీ కార్యదర్శి ఎం.నారాయణమ్మ పర్యవేక్షించారు.

ఉపాధి పనులు ప్రారంభం



ఉపాధి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ కన్నబాబు

ఎచ్చెర్ల: మండలంలోని ధర్మవరం గ్రామంలో ఉపాధి హామీ పనులను సర్పంచ్ అల్లు కన్నబాబు సోమవారం ప్రారంభించారు. వేతనదారులు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమయపాలన పాటిస్తే వేతనం గిట్టుబాటు అవుతుందన్నారు. ఉపాధి సిబ్బంది ఉన్నారు.

బాగుబడింది

చంద్రయ్యపేట యూపీ పాఠశాలలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల వంటి మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడేవారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ పాఠశాలను పూర్తిగా పట్టించుకోలేదు. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల్లో చేరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ పాఠశాలకు నాడు–నేడు పథకం కింద సుమారుగా రూ.23 లక్షలను మంజూరు చేశారు. ఈ నిధులతో పాఠశాలను సుందరంగా తీర్చిద్దారు. పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో చంద్రయ్యపేట గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



సుందరంగా తీర్చిదిద్దిన చంద్రయ్యపేట యూపీ పాఠశాల



చంద్రయ్యపేట యూపీ పాఠశాల దుస్థితి

జి.సిగడాం

విగ్రహ ఏర్పాటుకు యువనేత ఆర్థిక సాయం



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు ఔదర్యాన్ని చాటుకున్నారు. గూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మట్ట రాజు విగ్రహం ఏర్పాటు కోసం తనవంతుగా రూ.50 వేల ఆర్థికసాయాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో సంబంధిత ప్రతినిధులకు సోమవారం అందజేశారు. కొద్ది రోజుల క్రితం రాజు అకాల మరణం చెందారు. ఆ సమయంలో ఆయన ఆయన నివాసానికి రామ్‌మనోహర్‌నాయుడు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీకి ఆయన మంచి సేవలందించారని, ఆయన లోటు తీరన్నారన్నారు. అటువంటి వ్యక్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకునేలా విగ్రహ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులను కోరారు. దీంతో ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోవిందరాజులు, ఎంపీటీసీ సభ్యుడు అప్పలరాజు, యజ్జల గురుమూర్తి, మట్ట రాజారావు, రాంబాబు, డిల్లీరావు, సంతోష్ ఉన్నారు.

ఏపీటీఎఫ్ ధర్నా నోటీసు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏళ్ల తరబడి పేరుకుపోయిన పీఎఫ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మార్చి ఆరో తేదీన శ్రీకాకుళం జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని ఏపీటీఎఫ్ ప్రతినిధి బృందం పేర్కొంది. ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.వెంకటేశ్వరరావును సోమవారం ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి నేతృత్వంలో కలిసి ధర్నా నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పీఎఫ్ స్లిప్పులు గత కొన్ని సంవత్సరాలుగా ఇవ్వడం లేదని, ఆన్‌లైన్ సర్వీసులు నిలుపుదల చేశారని, కనీసం మాన్యువల్‌గానైనా ఉపాధ్యాయులకు పీఎఫ్ స్లిప్పులు అందజేయాలని కోరారు. సీఈవోను కలిసిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, సంఘ శ్రీకాకుళం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.వి.అనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శులు చావలి శ్రీనివాస్, దాసరి రామ్మోహనరావు, రాష్ట్ర కౌన్సిలర్ పైడి శ్రీరామమూర్తి, సదాశివుని శంకరరావు, బొడ్డేపల్లి మహేష్, ఎం.వి.కామేశ్వరరావు, కె.మురళీధర్, జి.గోవిందరావు ఉన్నారు.



జెడ్పీ సీఈవో వెంకటేశ్వరరావుకు నోటీసు అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

డివైడర్‌పైకి దూసుకొచ్చిన లారీ

ఎచ్చెర్ల క్యాంపస్:

జాతీయ రహదారిపై కేశవరావుపేట పంచాయతీ కింతలిమిల్లు వద్ద ఓ లారీ డివైడర్‌పైకి దూసుకుపోయింది. దాదాపు 50 మీటర్ల వరకు రైలింగ్‌ను తోసుకుంటూ లారీ ముందుకు వెళ్లింది. డ్రైవర్ నిర్లక్ష్యం, నిద్రమత్తు వల్లే ఘటన జరిగినట్లు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహన చోదకులు, పాదచారులు లేకపోవడంతో ప్రమాదం తప్పింది.జాతీయరహదారుల సిబ్బంది, హైవే పెట్రో లింగ్ సిబ్బంది సోమవారం ఉదయం సహాయ చర్యలు చేపట్టారు. లారీ క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్, క్లీనర్‌కు సైతం ఎలాంటి గాయాలు కాలేదు.



కింతలిమిల్లు సమీపంలో డివైడర్‌పైకి దూసుకు వచ్చిన లారీ

ఉత్సాహంగా క్రీడా పోటీలు



వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

సోంపేట: ఇస్కలపాలెం గ్రామంలో శ్రీకాకుళం నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మండస బ్లాక్ లెవల్ క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. వాలీబాల్, కబడ్డీ, వంద మీటర్ల పరుగు పందెం పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బైపల్లి కామమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బైపల్లి రామారావు, నాయకులు బి.ఈశ్వరరావు, బి.తిరుపతి, ఎస్.జీవన్, బి.బాబూరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్యామ్, నేషనల్ యూత్ వలంటీర్లు ఎరుపల్లి గణేష్, ప్రసాద్ ఉన్నారు.

వేడుకగా ఉమారామలింగేశ్వర స్వామి కల్యాణం

టెక్కలి: స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని ఉమా రామలింగేశ్వర ఆలయం వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా స్వామి వారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు కాశీ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితుల సమక్షంలో వేద మంత్రాలతో స్వామి వారికి కల్యాణం జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. వార్షికోత్సవంలో భాగంగా స్వామి వారి తిరువీధి కార్యక్రమాలతో ఆధ్యాత్మికత సంతరించుకుంది. భక్తులంతా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.



కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు

5న మండల సమావేశం

ఎచ్చెర్ల: లావేరు మండల పరిషత్ కార్యాలయంలో వచ్చే నెల 5వ తేదీన మండల సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ భాస్కరరావు సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

ఉమారుద్రునికి విశేష పూజలు



పూజలందుకున్న స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్: గుడివీధిలోని నాగావళి నదీ తీరాన ఉన్న ఉమారుద్రకోటేశ్వర స్వామికి మాఘమాస సోమవారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. అర్చకులు ఆరవెల్లి శ్రీరామూర్తి, చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పూజలు, విశేష హారతులు ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు ముంగిట సన్మానం కార్యక్రమం

శ్రీకాకుళం కల్చరల్: ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా రంగస్థల కళాకారుల సమాఖ్య నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన ముంగిట సన్మానం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని నిర్వాహకులు చిట్టి వేంకటరావు, ఎల్.రామలింగస్వామి, పన్నాల నర్సింహమూర్తి, బి.రామచంద్రదేవ్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ జాతీయ మిమిక్రీ కళాకారుడు ఎల్.నందికేశ్వరరావును అతని ఇంటి వద్దకు వెళ్లి సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఏటా ఈ రోజున ఒక సీనియర్ కళాకారుడి ఇంటికి వెళ్లి సత్కరించడం ఆనవాయితీ అన్నారు.

శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు

శ్రీకాకుళం కల్చరల్: శివరాత్రి ఉత్సవాలకు పట్టణంలోని పలు చోట్ల కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. గుజరాతీపేటలోని రాజరాజేశ్వరీ లలితా మహాత్రిపుర సుందరిదేవీ పీఠంలో రాజరాజేశ్వరస్వామికి మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నట్లు పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేనెల ఏడు నుంచి తొమ్మిదో తేదీ వరకు స్వామికి సహస్ర కలశ స్నపన పూర్వక మహా రుద్రాభిషేక సహిత రుద్ర మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే బలగ అయ్యప్పస్వామి ఆలయంలో ఉన్న శివాలయంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా సామూహిక మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరుగుతాయని అర్చకులు దేవరకొండ శంకరనారాయణ శర్మ తెలిపారు. స్వామివారికి లింగోద్భవ కాలం వరకు అభిషేకాలు జరుగుతాయని.. ఇందులో పాల్గొనే భక్తులు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

ఒకటిన జిల్లాస్థాయి ప్రతిభా పోటీలు

వజ్రపుకొత్తూరు: పూండికి చెందిన యువతరం సేవా సమితి నాలుగో వార్షికోత్సవం సందర్భంగా వివిద ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చింత మురళి సోమవారం తెలిపారు. మార్చి ఒకటో తేదీన పూండిలోని సాయి వినీత్ విద్యా సంస్థ ఆవరణలో ఉదయం తొమ్మిది గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ పేరును రిజిస్టర్ చేసుకునేందుకు 94906 80546, 76619 44052 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



కొండబాబు తదితరులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ధర్మాన

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): టీడీపీలో 25 ఏళ్లుగా ఉంటున్న కళింగ వైశ్య సామాజిక వర్గానికి చెందిన నాయకుడు అంధవరపు కొండబాబుతో పాటు పలువురు వైస్సార్‌సీపీలో చేరారు. అభివృద్ధి రథసారధి మంత్రి ధర్మాన ప్రసాదరావు సేవలకు ఆకర్షితులైన కొండబాబుతో పాటు మరో 50 మంది వైఎస్సార్‌సీపీ తీర్థం తీసుకున్నారు. ఆదివారం పీఎన్‌కాలనీలో జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో పార్టీలో చేరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: పేదలు అత్యవసర సమయాల్లో చేసుకున్న వైద్యానికి అయ్యే ఖర్చులను సీఎం సహాయ నిధి ద్వారా చెల్లించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎచ్చెర్ల మండలంలోని అరిణాంఅక్కివలస గ్రామానికి చెందిన సూరపురెడ్డి రామారావు అనే బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ రూ.1.20 లక్షలు, జి.సిగడాం మండలంలోని పెంట గ్రామానికి చెందిన మీసాల రత్నంనాయుడు అనే బాధితుడికి రూ.1.10 లక్షల చెక్‌ను సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.వెయ్యి దాటి రూ.25 లక్షల లోపు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయిడం జరుగుతుందన్నారు. పేద ప్రజలు ఆపదలో ఉంటే నేను ఉన్నానని సీఎం జగన్ అండగా నిలుస్తున్నారన్నారు. ఎచ్చెర్ల మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు మురళీధర్ బాబా, అరిణాం అక్కివలస సర్పంచ్ అంబటి శ్రీనివాసరావు, పెంట సర్పంచ్ పున్నాన అక్కలనాయుడు, పార్టీ నాయకుడు మీసాల శ్రీనివాసరావు ఉన్నారు.

న్యాయ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఒకే వేదికపై పూర్వవిద్యార్థులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విశాఖ న్యాయ విద్యాపరిషత్ కళాశాలలో 1981–1985 విద్యా సంవత్సరంలో చదివిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు అతిథిగృహంలో సోమవారం నిర్వహించారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆనందించారు. కార్యక్రమంలో ఫ్యామిలీకోర్టు అడ్వకేట్ అండ్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్, శ్రీకాకుళం సెషన్స్ జడ్జి వాన కృష్ణచంద్‌లతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

అకస్మాత్తుగా ఆగిన కంటైనర్



కశింకోట వద్ద రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న వ్యాన్



ప్రమాదానికి కారణమైన కంటైనర్ లారీ

కశింకోట: అన్నవరం సత్యనారాయణస్వామి దర్శనానికి బయల్దేరిన ఐదుగురు భక్తులు గాయపడ్డారు. కశింకోట జాతీయ రహదారిపై సోమవారం ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఎస్ఐ రమేష్‌బాబు వివరాల ప్రకారం... అనకాపల్లి నుంచి యలమంచిలి వైపు వెళ్తున్న కంటైనర్ లారీ అకస్మాత్తుగా ఆగడంతో వెనుక వస్తున్న వ్యాన్ ఢీకొంది. దీంతో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న శ్రీకాకుళానికి చెందిన సకలాభక్తుల రామచంద్రరావు, భార్య పావని, బంధువులు చక్రపాణి, భాగ్యరేఖ, డ్రైవర్ శ్రీనివాస్ గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. శ్రీకాకుళం నుంచి అన్నవరం వెళుతుండగా ఈ ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదంలో వ్యాన్ ముందు భాగం దెబ్బతింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చక్రతీర్థ స్నానాల్లో అపశృతి

సారవకోట: చీడిపూడి గ్రామంలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. శనివారం నిర్వహించిన చక్రతీర్థ స్నానాలకు హాజరైన బాడాన రామచంద్రరావు(18) ఎర్రన్నాయుడు కోనేరులో మునిగి చనిపోయాడు. కానీ ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. చీడిపూడి గ్రామానికి చెందిన ప్రభాకరరావు, రాధ దంపతుల కుమారుడు రామచంద్రరావు. తల్లిదండ్రులు విడిపోవడంతో రామచంద్ర తండ్రితో పాటు చీడిపూడిలో ఉంటున్నాడు. శనివారం ప్రభాకరరావు వ్యాపార రీత్యా వేరే చోటకు వెళ్లగా రామచంద్ర ఎదురింటి వాళ్లకు ఇంటి తాళం ఇచ్చి చక్రతీర్థ స్నానాలకు వెళ్లాడు. తండ్రి ఇంటికి వచ్చి చూసే సరికి కొడుకు కనిపించలేదు. ఎదురింటి వారు కూడా ఇంకా రాలేదని చెప్పడంతో చక్రతీర్థ ఉత్సవమంతా గాలించారు. చెరువులో కూడా వెతికినా లాభం లేకపోయింది. చివరకు జేసీబీలతో చెరువు గట్టు కొట్టి నీటిని బయటకు తరలించగా ఊబిలో శవమై కనిపించాడు. విషయం తెలిసిన తల్లి రాధా కూడా గ్రామానికి వచ్చి బోరున విలపించింది. రామచంద్రరావు నరసన్నపేటలోని ఒక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. దీనిపై సారవకోట పోలీసుస్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని హెచ్‌సీ సింహాచలం తెలిపారు.